

రైల్వే స్టేషన్‌లో
రూ. 50 వేలు చోరీ
● బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్ తీసుకుంటుండగా అపహరణ
● గద్వాల పట్టణంలో ఘటన
7

సంపులో పడి బాలుడి మృతి
● నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో ఘటన
7



నారాయణపేట మండలంలోని అంభగాపూర్‌లో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

క్షయ బాధితులకు..
అందని సాయం

● పౌష్టికాహారం కోసం నెలకు రూ.1,000 ఇస్తున్న కేంద్రం
● ఉమ్మడి జిల్లాలో 6,002 మంది గుర్తింపు
● 5,865 మందికి అందాల్సిన రూ.3.51 కోట్లు

నారాయణపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదు. వారు త్వరగా కోలుకోవాలంటే మందులతో పాటు పౌష్టిక ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం బాధితులకు గవర్నమెంట్ నెలకు రూ.1,000 చొప్పున ఆరు నెలల పాటు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 6,840 బాధితులను గుర్తించగా, అందులో పౌష్టికాహారం అవసరం అయిన వారిని 6,002 మందిని గుర్తించారు. వారిలో కేవలం 137 మందికి మాత్రమే డబ్బులు ఇచ్చారు. మిగతా 5,865 మందికి రూ.3,51,90,000 అందాల్సి ఉంది.

మందులు వేసుకుంటే ఆరు నెలల్లో తగ్గుదల

డబ్బులు అందకపోవడంతో బాధితులు పౌష్టికాహారం తీసుకోలేపోతున్నారు. దాంతో వెంటనే కోలుకోలేకపోతున్నారు. క్షయ నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా వైద్య బృందాలతో గ్రామాల్లో పర్యటించి అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్ధారణ అయిన వారికి చికిత్స అందిస్తున్నారు. టీబీని ఏ మాత్ర నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జర్వం ఉండటం, నెలల వ్యవధిలోనే బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దానిని టీబీగా గుర్తిస్తారు. షుగర్, హెచ్ఐవీ, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు టీబీ త్వరగా సోకుతుంది. సకాలంలో గుర్తించి, మందులతో పాటు పౌష్టిక ఆహారం తీసుకుంటే ఆరు నెలల్లోనే తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

సమస్య అన్ని చోట్ల ఉంది



చికిత్స పొందుతున్న క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావల్సి ఉంది. ఈ సమస్య అన్ని చోట్ల ఉంది. నిధులు మంజూరైన వెంటనే ఖాతాల్లో జమ చేస్తాము.

\- జయచంద్రమోహన్, డీఎంహెచ్‌వో, నారాయణపేట

జిల్లాల వారీగా గుర్తించిన కేసులు, లబ్ధి పొందిన, పొందాల్సిన వారి వివరాలు

జిల్లా పేరు	గుర్తించిన కేసులు	పౌష్టికాహారం కోసం అర్హులైన వారు	ఇప్పటికే లబ్ధి పొందిన వారు	లబ్ధి పొందని వారు	అందాల్సిన డబ్బులు
నారాయణపేట	1,132	951	01	950	57,00,000
నాగర్‌కర్నూల్	1,629	1,415	22	1393	83,58,000
మహబుబ్‌నగర్	1,363	1,062	21	1041	62,46,000
వనపర్తి	1,057	1,015	93	922	55,32,000
జోగుళాంబ గద్వాల	1,659	1,559	0	1559	93,54,000
మొత్తం	6,840	6002	137	5865	3,51,90,000

ఒక్క పీడీ లేడు

ఇంటర్‌లో క్రీడలకు దక్కని ప్రోత్సాహం



మహబూబ్‌నగర్‌లోని బాలుర జూనియర్ కళాశాల

● వెలుగులోకి రాలేకపోతున్న క్రీడాకారులు
● ఈ ఏడాది 20 మంది మాత్రమే జాతీయ స్థాయికి ఎంపిక
● ఉమ్మడి జిల్లాలో 59 ఇంటర్ కళాశాలలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే క్రీడాకారులకు మౌలిక వసతులు అవసరం. మైదానాలు, సానబెట్టే గురువులు, పరికరాలు ఉండాలి. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇంటర్ కళాశాలల్లో ఒక్క పీడీ కూడా లేకపోవడంతో రాణించలేకపోతున్నారు. దాంతో ప్రతిభ ఉన్నా ఎందరో విద్యార్థులు వెలుగులోకి రాలేక పోతున్నారు. ఉన్న వనరులు, సీనియర్ క్రీడాకారుల ప్రోత్సాహంతో కొందరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్ల గలుగుతున్నారే తప్ప ఫలితాలు ఆశించిన మేర కనిపించడం లేదు.

59 కళాశాలలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 59 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో మహబూబ్‌నగర్‌లో 15 కళాశాలలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో 16, వనపర్తిలో 12, జోగుళాంబ గద్వాలలో 8, నారాయణపేటలో 8 ఉన్నాయి. వాటికి ఒక్క పీడీ కూడా లేరు. చాలా కళాశాలలకు మైదానాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. జడ్చర్ల బాలికల జూనియర్ కళాశాలలో పని చేసే ఒక పీడీ రెండు నెలల క్రితం రిటైర్డ్ అయ్యారు. దీంతో అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ కష్టంగా మారింది. అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి ఏప్రిల్‌లో రిటైర్డ్ కావటంతో పీడీ పోస్టు ఖాళీ అయ్యింది.

ఒక జాతీయ, ఐదు రాష్ట్ర స్థాయి టోర్నీలు..

2024-25 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 5 రాష్ట్ర స్థాయి, ఒక జాతీయ స్థాయి టోర్నీలు పాఠశాలల పీఈటీల సహకారంతో నిర్వహించారు. దేవరకద్ర నియోజవర్గం అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల, బాలికల కబడ్డీ టోర్నీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ, నారాయణపేట జిల్లా ధన్వాడలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ టోర్నీ, జడ్చర్లలో రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల, బాలికల ఫుట్‌బాల్ టోర్నీ, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం రఘుపతిపేటలో రాష్ట్రస్థాయి అండర్ 19 బాల బాలికల మాల్కం పోటీలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా గూండుమాల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ, కోస్గి పట్టణంలో ఎస్‌జీఎఫ్ఐ 68వ జాతీయ స్థాయి అండర్ 19 బాలుర వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. 2024-25లో జాతీయ స్థాయికి కేవలం 20 మంది మాత్రమే ఎంపికైయ్యారు.

అండర్-19 ఎస్‌జీఎఫ్ ఎంపికలు నిర్వహిస్తాం..

అండర్-19 ఎస్‌జీఎఫ్ ఎంపిక బాధ్యతలు కలెక్టర్ ఆదేశాల మేరకు అండర్-17 సెక్రటరీ శారదాబాయికి అప్పగించాము. ఉన్న ఒక్క పీడీ రిటైర్డ్ అయ్యారు. దీంతో ఇంటర్ కళాశాలల్లో పీడీలు లేరు. టోర్నీలు, ఎంపికలు ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో చేపట్టేందుకు కృషి చేస్తాం.

\- కౌసర్ జహాన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో తలపడుతున్న జిల్లా జట్లు(ఫైల్)

అండర్-19 క్రీడల నిర్వహణ బాధ్యతలు అండర్-17 సెక్రటరీకి అప్పగింత..

జూనియర్ కళాశాలలకు పీడీలు లేకపోవడంతో 2025-26లో అండర్-19 క్రీడల నిర్వహణ ఎలా చేపతారో తెలియని దుస్థితి నెలకొంది. ఇంటర్ క్రీడాకారులకు ఇటీవలే

(మిగతా 6లో..)

నారాయణపేట డీఎంహెచ్‌వోకు
రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు

● అడిగిన సమాచారం ఇవ్వనందుకు డీఎంఅండ్‌హెచ్‌వోతో పాటు ఊట్కూర్ పీహెచ్‌సీ డాక్టర్ కమిషన్ ముందు హాజరు కావాలని ఆదేశం

ఊట్కూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడిగిన సమాచారం ఇవ్వనందుకు నారాయణపేట జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓతో పాటు ఊట్కూర్ ఆసుపత్రి డాక్టర్‌కు రాష్ట్ర సమాచార కమిషన్ ముందు ఈ నెల 14న హాజరు కావాలని నోటీసులు వచ్చాయి. మండలంలోని మగ్దూంపూర్ గ్రామానికి చెందిన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నర్సిములు 2019-2020 సంవత్సరంలో కరోనా నుంచి రక్షణ కోసం ఎంతమందికి వ్యాక్సిన్లు వేశారు?, ఎన్ని పీపీ కిట్లు వచ్చాయి?, ఆ సమయంలో పని చేసిన వారికి వేతనాలు అదనంగా చెల్లించారా?, ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు ఇవ్వాలని ఊట్కూర్ ఆసుపత్రితో పాటు జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓను సమాచారం అడిగారు. ఇవ్వకపోవడంతో రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దరఖాస్తును పరిశీలించిన సమాచార కమిషన్ ఈ నెల 14న ఉదయం 10 గంటలకు రాష్ట్ర కమిషన్ ముందు హాజరు కావాలని డీఎంఅండ్‌హెచ్ఓ, ఊట్కూర్ డాక్టర్‌కు నోటీసు ఇచ్చినట్లు నర్సిములు తెలిపారు.

నల్లమలలో పర్యాటకుల రద్దీ
● రెండు రోజుల సెలవులతో శ్రీశైలానికి భక్తుల బారులు
● ఘాట్ రోడ్డులోని మన్ననూరు, బ్రహ్మగిరి చెక్‌పోస్టుల వద్ద ట్రాఫిక్ జామ్
7

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

భక్తజన సంద్రం

● ఆదివారం అదే జోరు
● కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

చిన్నచింతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో జాతరకు భక్తులు వేలాదిగా తరలొచ్చారు. జాతర మైదానం భక్తజన సంద్రంగా మారింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మక్తల్, నర్వ, ధన్వాడ, నారాయణపేట, కొత్తకోట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. స్వామి వారి మెట్ల దారి భక్తులతో నిండిపోయింది. జాతర మైదానం జన సంద్రంగా మారింది. కోనేరులో స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేశారు. చెట్ల కింద, రేకుల షెడ్లలో దాసంగాలు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. మాంసం దుకాణాల వద్ద కూడా జనం పెద్ద ఎత్తున కనిపించారు. ఆలయ చైర్మన్ ఈవో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జాతరలో కిటకిటలాడుతున్న భక్తులు



వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు స్పందన




మహబూబ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంవో దుంకుడు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్ఎంఎంఎస్) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మాడ్రన్ హైస్కూల్‌లో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఆదివారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జామ్‌కు విశేష స్పందన వచ్చింది. వివిధ పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మాడ్రన్ హైస్కూల్ కేంద్రంలో 400 మంది విద్యార్థులు, హన్వాడ మండల కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు మహబూబ్‌నగర్ ఫస్ట్ నిర్వాహకులు గుండామనోహర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 100 మందికి ఈ నెల 12 నుంచి 22 వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఈనెల 23న ఫైనల్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల ఏర్పాట్లను ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవోలు, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

చంద్రఘడ్ కోటపై చిన్నచూపేలా?
● పర్యాటక కేంద్రంగా మారేనా?
● నెరవేరని మంత్రుల హామీ
● చెక్కుచెదరని 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కోట
7



చంద్రఘడ్ కోట

ఒక్క పీడీ లేడు

(5వ పేజీ తరువాయి)

వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడల్లో మాత్రమే ఎంపికలు నిర్వహించారు. అండర్-14, 17 అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తుడటంతో.. అండర్-19 ఎంపికలు కూడా నిర్వహించాలని పలువురు క్రీడాకారులు ఆందోళన చేశారు. విషయం ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకవెళ్లడంతో అండర్-19 ఎస్‌జీఎఫ్ ఎంపికల బాధ్యతను ప్రస్తుత అండర్-17 సెక్రటరీ శారదాబాయికి అప్పగించారు. ఇంటర్ కళాశాలల్లో ఒక్క పీడీ లేక పోవడంతో అండర్-19 సెక్రటరీని నియమించ లేదు. అండర్-19 సెక్రటరీగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే సీనియర్ పీడీలకు అవకాశం కల్పిస్తారా? లేదంటే గురుకులాల పీడీలకు అవకాశం ఇస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రైవేట్ కళాశాలల్లో కనిపించని క్రీడలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 100కుపైగా ఇంటర్ ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండరు. కేవలం పరీక్షల్లో ర్యాంకులు ఎలా సాధించాలనే అంశంపైనే దృష్టి సారిస్తారు. కొన్ని కళాశాలలు మాత్రమే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాయి. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించేలా ఇంటర్ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

12న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న అండర్-14, 17 ఉమ్మడి జిల్లా బాల, బాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఆదవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీ ఆనంద్‌కుమార్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

కార్తీక మాసం వన భోజనాలు



ఉసిరి చెట్టుకు పూజ చేస్తున్న భక్తులు

హన్వాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం బుద్దారం గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ఉసిరి చెట్టుకు పూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామంలోని భజన భక్తులు, పెద్దలు పూజలో పాల్గొన్నారు. 15 సంవత్సరాలుగా కార్తీక మాసంలో వన భోజన కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరణకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై పార్టీలకు చిత్తశుద్ధి లేదు

● బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్



ఛాయ్‌పే చర్చలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

పాలమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అన్ని రాజకీయ పార్టీలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యం.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని బీసీ రిజర్వేషన్లపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. బీసీలకు రిజర్వేషన్ అమలు కావాలంటే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాధ్యమవుతుందన్నారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో పెడితేనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఉంటుందన్నారు. బీసీలకు 42శాతం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వాలన్నారు. లేకపోతే బీసీల నుంచి తిరుగుబాటును మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. మన ఓటు మనకే వేసుకుని బీసీలను అత్యధిక మందిని చట్టసభల్లోకి పంపేందుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కుమ్మరి సంఘం రాంచంద్రయ్య, రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ వెంకటయ్య, రిటైర్డ్ జీహెచ్‌ఎంలు శ్రీనివాసులు, వి.కురుమూర్తి, భగవంతు, ఎంఈవో కురుమూర్తి, చెన్నయ్య, బాలశంకర్, విజయకుమార్, జుర్రు నారాయణ, బుగ్గన్న, బాలరాజు, ప్రేమసాగర్, మహేందర్, వెంకటేష్‌గౌడ్, శేఖర్, దు ర్గేష్, ఆంజనేయులు, కృష్ణ, ఉమాపతి, బీ రయ్య, మోహన్, వెంకటయ్య, భాస్కర్, రాఘవేంద్ర, నరేందర్, రఘు, సాయి, శంకర్ పాల్గొన్నారు.

ఆదిమకాలం నుంచి మతంపై ప్రతిఘటన



సదస్సులో మాట్లాడుతున్న అంబటి నాగయ్య

● తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య

పాలమూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదిమకాలం నుంచి మతాలు ప్రతిఘటన ఎదుర్కొంటున్నాయని తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటినాగయ్య అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు చింతకింది జనార్థన్, బీటీఎఫ్ అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, ఏ.భాస్కర్, మైత్రి యాదయ్య అధ్యక్షతన సైన్స్‌-మూఢ విశ్వాసాలపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంబటినాగయ్య మాట్లాడుతూ వేదాల నుంచి ప్రతీ మతంలో ఉన్న లోపాలను, అమానవీయ అంశాలను ఎదుర్కోడానికి అదే మతంలో ప్రతిఘటన ఎదురైందన్నారు. దాంతో మతం మార్పు చెందుతూ మనుగడ సాగిస్తోందన్నారు. ఉపనిషత్తులు తరువాత బుద్ధిజం, జైనిజం, అద్వైతం, ద్వైతం, తరువాత చార్వాకులు, లోకాయుతుల ఈ విధంగ ప్రతిఘటనను ఎదుర్కొంటూ నేడు సనాతన ధర్మం రూపంలో మతం కొనసాగుతోందన్నారు. ఈనాడు భారత సమాజంలో ఆర్‌ఎస్ఎస్ చరిత్రలోని అవలక్షణాలను సనాతన ధర్మం రూపంలో కొనసాగిస్తూ ప్రజలను విడదీస్తుందన్నారు. మెజారిటీ మతోన్మాదాన్ని ఎక్కిస్తూ పాసిజాన్ని సమాజంపై రుద్దుతోందన్నారు. ఆధిపత్యం చెలాయిస్తూ ఇదే ప్రజాచైతన్యం, దేశభక్తి అని చాటుతున్నారని అన్నారు. బుద్ధిజీవులు, మేధావులు దీన్ని గమనించి సమాజహితం కోసం ఆలోచించాలన్నారు. డాక్టర్ కె.జయకుమార్ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం అంశంపై మాట్లాడారు. జాతీయ మహిళా సంఘం కార్యదర్శి కొండా పద్మావతి పాడిన కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిచి మొక్కితే అమ్మరా పాట సభికులను అలరించింది. కార్యక్రమంలో ఎం రాఘవాచారి, ఎస్‌ఎం ఖలీల్, దానగల రవికుమార్, కవి వనజ్వాల, విజయ్‌కుమార్, చింతకింది బాలరాజు, చెన్నయ్య, జక్కా గోపాల్, ఇందిరా, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, గాలి యాదయ్య, గుంటూరు ప్రముఖులు సుధాకర్, సత్యనారాణ, సింగిరెడ్డి పరమేశ్వర్, బుద్ధసమాజ్ అధ్యక్షుడు మల్లెపోగు ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ రామదాసు, అమరచింత, ఆత్మకూర్, మక్తల్, వనపర్తి నుంచి అధికంగా ప్రజలు హాజరయ్యారు.

13న జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో పీడీ అబ్దుల్లాకు రిపోర్టు చేయాలని కోరారు.

కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్ పోస్టుకు నేడు ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకం కింద మొబైల్ మెడికల్ యూనిట్‌లో పనిచేసేందుకు కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ (ఎంబీబీఎస్) పోస్టుకు సోమవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని రూమ్ నెం.201లో గల డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్

కబడ్డీ పూర్వవైభవానికి కృషి

● జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్

● ఉత్సాహంగా జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడా పూర్వవైభవానికి కృషి చేద్దామని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఆదివారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై కబడ్డీ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికావాలని ఆకాక్షించారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ బాల, బాలికల విభాగంలో 150 మంది ఎంపికలకు హాజరైయ్యారని తెలిపారు. ఈనెల 11 నుంచి కోచింగ్ క్యాంప్ నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన బాలుర జట్టు డిసెంబరు 5 నుంచి 7వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీ, బాలికల జట్టు కరీంనగర్ జరిగే టోర్నీలో పాల్గొంటుందని తెలిపారు. కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు ముత్యం, ఉమామహేశ్వర్‌రెడ్డి, రాములు, శ్రీహరి, శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాలరాజయ్య, తిరుపతయ్య, కిషన్‌దాస్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

వాలీబాల్‌లో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరిలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ రాష్ట్ర స్థాయి సీనియర్ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్ల ఎంపికలు ఆదివారం జిల్లా స్టేడియంలో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని, రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా విజేతగా నిలువాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ హనీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, సమాద్‌ఖాన్, బాలస్వామి, దస్తగీర్ ఖాన్, యాసీన్‌ఖాన్, కోచ్ పర్వేజ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రన్నర్‌గా మహిళా జట్టు



సాఫ్ట్‌బాల్ టోర్నీలో రన్నర్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాలలో ఈనెల 7 నుంచి ఆదివారం వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళా సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహిళా జట్టు రన్నర్‌గా నిలిచింది. జిల్లా జట్టు రన్నర్‌గా నిలువడం పట్ల జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రాజు, అసోసియేషన్ ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ వేడుకలు



గ్యార్వీ వేడుకల్లో విద్యా కమిషన్ మెంబరు చారకొండ వెంకటేశ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్

కల్వకుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్‌లోని గ్యార్వీ వేడుకలకు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యా కమిషన్ మెంబరు చారకొండ వెంకటేశ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ముస్లిం సోదరులతో కలిసి వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్వీ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ ఎజాస్, మార్కెట్ డైరెక్టర్ మసూద్, మైనార్టీ నాయకులు సోఫీ, ఆరీఫ్, ముక్తాదర్, ఖయ్యూం, హిమాయత్ అవేజ్, జిలానీ, సాలం తదితరులు పాల్గొన్నారు.

పాటు కాలువకు మరమ్మతులు

కోడేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు తెగిపోయిన పాటు కాలువకు స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు మెగా కంపెనీ వారు మరమ్మతులు చేశారని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బావాయిపల్లి గ్రామంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలకు ఊర చెరువుకు వచ్చే పాటు కాలువ తెగిపోయింది. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు మెగా కంపెనీ వారు పాటు కాలువకు మరమ్మతులు చేశారని, మెగా కంపెనీవారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పాటు కాలువ మరమ్మతు చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచు ఎన్వి ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నక్క వేణుగోపాల్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు నక్క రాములు, పొడెండ్ల నాగన్న, ఇంజమూరి కురుమయ్య, శ్యాం, రాజు, బొక్కలయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సే షరీఫ్

ఊర్కొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట శివారులో వెలిసిన హజ్రత్ అమీనొద్దీన్ వలీయా దర్గాలో కనుల విందుగా ఉర్సే షరీఫ్ వేడుకలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు ఆదివారం గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు ఘనంగా దీపారాధన చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, నాయకులు వహీదొద్దీన్, దర్గా కమిటీ సభ్యులు జహంగీర్, ఖదీర్, ఖాజామైద్దీన్, అజహర్, చోటు, కైసర్ ఉన్నారు.



ఊర్కొండపేట హజ్రత్ అమీనొద్దీన్ వలీయా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం నాయకులు, భక్తులు

కుప్పగట్టు భూములపై విచారణ జరిపించాలి

● ప్రభుత్వ భూములు కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో

● మంత్రి జూపల్లి స్పందించాలి..

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాల నరసింహ

● నల్లమలలో చెట్లు నరికినా పట్టించుకోని అధికారులను సస్పెండ్ చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్



చదును చేసిన కుప్ప గట్టు భూములను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

కొల్లాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం ఎల్లూరు శివారులో నల్లమల రిజర్వ్ ఫారెస్టు దగ్గర్లో ఉన్న సర్వేనెంబర్ 359, 360, 364, 365, మొత్తం 45 ఎకరాల కుప్ప గట్టు భూమిని హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ వ్యక్తులు చదును చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ఎం. బాలనరసింహ అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌తో కలిసి ఆయన కుప్పగట్టు భూములను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ భూమి 1995-96 వరకు సీలింగ్ భూమిగా, సర్కార్ భూమి అని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో 2009-2010 సంవత్సరాల మధ్యలో జటప్రోలు సంస్థానాధీశులు అయిన సురభి ఆదిత్య లక్ష్మణరావు ఆయన సోదరి సుధారాణిపైన పట్టా ఉందని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీకి చెందిన వారు కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు సీలింగ్ భూమిని ఏ విధంగా పట్టా భూమిగా మార్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మంత్రి జూపల్లి కృష్ణా రావు తక్షణమే దీనిపై స్పందించి ఈ భూములపైన సమగ్ర విచారణ జరపాలని బాలనరసింహ కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహ, ఏసయ్య, ఇందిరా, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా సమితి సభ్యులు కురుమయ్య, శివశంకర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయ కులు శివకృష్ణ, శివుడు, కృష్ణ, వెంకటస్వామి, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో వీపనగండ్ల విద్యార్థుల సత్తా

కొత్తకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడబాకుల గ్రామ శివారులోని వీపనగండ్ల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లా జోనల్ క్రీడల్లో సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు రోజులుగా జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ పోటీలు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహించారు. జరిగిన అన్ని క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందారు. అండర్- 17 ఫుట్‌బాల్, కబడ్డీ, చెస్, అండర్-19 ఫుట్‌బాల్, క్యారమ్స్ పోటీల్లో ప్రథమ, హ్యాండ్బాల్, ఖోఖో క్రీడల్లో ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. అలాగే 1500, 800 మీటర్ల అథ్లెటిక్స్ పోటీల్లో మొదటి బహుమతి అందుకున్నారు. జిల్లా స్థాయిలో రాణించి వీపనగండ్ల గురుకుల పాఠశాల, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన ఫిజికల్ డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుపొందిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి

ఓపెన్ స్కూల్ చక్కని అవకాశం

- రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి

కందనూలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులకు ఓపెన్ స్కూల్ సువర్ణ అవకాశమని రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి అన్నారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారు విధిగా ప్రతీ రెండవ శని, ఆదివారాల్లో తరగతులకు హాజరు కావాలని అన్నారు. ఆదివారం నాగర్‌ర్నూల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లల్లో బోధన ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపెన్ స్కూల్ బోధనా తరగతులను పరిశీలించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతిలో 403 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 996మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఆయన తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇదొక సువర్ణ అవకాశమని అన్నారు. ఆయన వెంట జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శివప్రసాద్, ఆయా సెంటర్ల అధ్యాపకులు, రవిప్రకాశ్, తిరుపతయ్య, అహ్మద్, యాదగిరి, బాలరాజు తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీలు

కల్వకుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో సోమవారం ఉదయం జిల్లా స్థాయి బాలికల అథ్లెటిక్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14, అండర్-16 బాలికలు పాల్గొనాలని ఆయన కోరారు.

కళ కళ కోసం కాదు ప్రజల కోసం

- రెండో రోజు శిక్షణ శిబిరంలో ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి విజేయుడు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి విజేయుడు

పెద్దకొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కళ కళకోసం కాదని, కళ ప్రజల కోసమని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి విజేయుడు వెల్లడించారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రెండోరోజు జిల్లా స్థాయి ప్రజానాట్య మండలి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన కమ్యూనిస్టులు, సామ్యవాద సిద్ధాంతాల ఆధారంగా ప్రజల సమస్యలను వీధి నాటకాలు, పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చడానికి కృషి చేస్తూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బావుట ఎగురవేసిందని విజేయుడు అన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు టి.నరసింహ, మల్లేష్, బిజ్జ శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణస్వామి, కృష్ణ, కళాకారులు తుపాకుల వెంకటేశ్, చందు, ఉషన్న గౌడ్, రామకృష్ణ, జ్యోతి, లక్ష్మీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కే.జంగయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పీఆర్‌టీయూ నాయకులు పరామర్శించారు. ఆ సంఘం సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మర్యాద కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రియాజ్, జిల్లా అధ్యక్షుడు సత్య నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సంపులో పడి బాలుడి మృతి


శశిధరన్ (ఫైల్)

బిజినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని సుబ్బయ్య గూడెంలో సంపులో పడి శశిధరన్(3) అనే బాలుడు శనివారం చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సుబ్బయ్య గూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో నూతనంగా ఇంటి నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ సంపును తవ్వించాడు. రెండో శనివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో ఇంటి దగ్గరే ఉన్న బాలుడు శశిధర్ కాలనీలోని తోటి పిల్లలతో ఆడుకుంటుండగా నీటి గుంతలో పడి మునిగిపోయాడు. బాలుడి తల్లి కూలీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన కొడుకు కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అనుమానం వచ్చి కాలనీవాసులతో కలిసి నీటి గుంతలోకి దిగి చూడగా బాలుడి మృతదేహం లభించింది. ఏడాదిన్నర క్రితం భర్త చనిపోయి తీవ్ర మనోవేదనలో ఉన్న తల్లికి ఉన్న కొడుకు కూడా చనిపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలుడు మృతి చెందాడని స్థానికులు, బంధువులు ఆరోపించారు.

తప్పిన పెను ప్రమాదాలు

» వేర్వేరుగా ఒకదానికి ఒకటి ఢీకొన్న వాహనాలు..

మానవపాడు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం వేర్వేరుగా పెను ప్రమాదాలు తప్పాయి. ఒకే రోజు వరుసగా ఒకదానికి ఒకటి మూడు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనపై హైవే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జల్లాపూర్ స్టేజీ సమీపంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్లే దారిలో గూడ్స్ వాహనం ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీ కొట్టింది. దీంతో వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది.

ఈ ప్రమాదంలో గూడ్స్ వాహన డ్రైవర్ మిరాజ్‌కు గాయాలు కావడంతో వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనతో రెండు కిలో మీటర్లమేర ట్రాఫిక్ నిల్చింది. అలాగే మానవపాడు బస్టాండ్ సమీపంలో నిదానంగా వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు, మీనాక్షి ట్రావెల్ బస్సును ఢీ కొట్టింది. బస్సును వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. కేకలు వేస్తూ బస్సునుంచి దిగిపోయారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్, బస్సు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో గేదె...


ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె

రాజాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలోని స్థానిక దుందుభీ వాగు సమీపంలో వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈసంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైతు పొట్టల మల్లయ్య వివరాల ప్రకారం... తన దగ్గర ఉన్న గేదె ప్రతీ రోజు మాదిరిగా తమ పంట పొలం సమీపంలో గడ్డి మేస్తూ ఉన్నది. అందులో భాగంగా ఆదివారం గడ్డి మేస్తున్న గేదె, మా పొలం సమీపంలో నూతనంగా విద్యుత్ అధికారులు అజాగ్రత్తగా ఏర్పాటు చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. దాని విలువ సూమారు రూ.50 వేలు ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. విద్యుత్ అధికారుల సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కారు - ఆటో ఢీ : ముగ్గురికి గాయాలు

వంగూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని హైదరాబాదు-శ్రీశైలం ప్రధాన రహదారిలో వంగూరు గేటు సమీపంలోని జిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం కారు-ఆటో ఢీకొని ఒకరు తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. కల్వకుర్తి నుంచి డిండి వైపు వెళ్తున్న ఆటోను శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్ర మాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నల్లగొండ జిల్లా డిండి మండలం బొగ్గుల దోన గ్రామానికి గౌతమ్ తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ఉన్న ఇద్దరు స్వ ల్పంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం కిందపడి తల్లీకూతుళ్లకు..

వెల్దండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెల్దండ మండల కేంద్రంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనం కిందపడి తల్లీకూతుళ్లకు గాయాలయ్యాయి. ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేసే క్రమంలో తారును తీసివేయడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న స్వప్న, ఆమె కూతురు స్పందనలు అదుపుతప్పి కిందపడ్డారు. వీరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులు

» ఆర్టీసీ ఉద్యోగులకు డబుల్ డ్యూటీలు
» ఇబ్బంది పడుతున్న కండక్టర్లు

వనపర్తి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణం చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం, సిబ్బంది కొరత, వరుస డ్యూటీలతో నిద్రలేమి, పని ఒత్తిడితో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. 8 గంటలు డ్యూటీ చేయాల్సిన ఉద్యోగులు 12 గంటలు చేస్తున్నారు. సెలవుల్లో ఉన్నా, అనారోగ్యంతో ఉన్నా వారికి డ్యూటీలు, డ్యూటీ దిగిన వారికి డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. విశ్రాంతి లేకపోవడంతో డ్యూటీలు చేయడం ముప్పే అని పలువురు పేర్కొంటున్నారు.

'మహాలక్ష్మి'తో బస్సుల్లో మరింత రద్దీ

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల సంఖ్య మరింత రెట్టింపు అయింది. జిల్లావ్యాప్తంగా మామూలు దినాలలోనే కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. దసరా, బతుకమ్మ, కురుమూర్తి జాతర, దీపావళి పండుగలలో అయితే ప్రయాణం చెప్పుకోలేనంత. పండుగ దినాల వేళ ప్రత్యేక బస్సులు నడిపినా ప్రయాణికులు కిక్కిరిసినంతగా ఉంటోంది. పల్లె వెలుగులో 55 మంది, ఎక్స్‌ప్రెస్‌లో 50, డీలక్స్ 40, సూపర్ లగ్జరీ 36, ప్రయాణికుల సామర్థ్యం ఉంటుంది. ప్రస్తుతం ఏ బస్సు చూసినా రద్దీతో కిటకిటలాడుతున్నది. మహాలక్ష్మి అమలు తరువాత బస్సుల్లో నిలబడి ప్రయాణం చేసే వారి సంఖ్య పెరిగింది.

మంటలార్పే పరికరాలపై దృష్టి

బస్సు ప్రమాదాలతో ఆర్టీసీ అప్రమత్తమైంది. మంటలార్పే పరికరాలపై దృష్టి సారించింది. ఆర్టీసీ కండక్టర్‌లకు, డ్రైవర్‌లకు మంటలార్పే పరికరాలపై ఫైర్ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నారు. ఆర్టీసీలో అత్యవసర పరికరాల ఏర్పాటుకు కొంత సమయం ఇచ్చినట్లు తెలుస్తుంది. కొన్ని బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్స్‌లు లేకపోగా మరికొన్నింటిలో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫస్ట్ ఎయిడ్ కిట్ అందించాలని యోచిస్తున్నట్లు తెలుస్తుంది. కండక్టర్ టీం మిషన్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను తీసుకువెళ్లడం అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.


సామర్థ్యం కంటే ఎక్కువ సంఖ్యలో ఎక్కుతున్న ప్రయాణికులు

డ్రైవర్లకు, కండక్టర్లకు విశ్రాంతి కరువు

మోటార్ వాహనాల చట్టం ప్రకారం బస్సు డ్రైవర్‌కు గంటకుతరువాత 15 నిమిషాలు విశ్రాంతి ఇవ్వాలి. ఇలా ఎన్ని గంటలు నడిపితే అన్ని 15 నిమిషాలు గమ్యం చేరాక విశ్రాంతి ఉండాలి. ఒక రోజు విధులు నిర్వహిస్తే మరుసటి రోజు సెలవు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీ అధికారులు ఇష్టానుసారంగా విధులకు పంపిస్తున్నారు. అద్దె బస్సు డ్రైవర్‌కు రోజు విడిచి రోజు విధులకు రావాలని చెబుతూ సంస్థ డ్రైవర్లకు ఓటీ చేయాలని చెప్పడం గమనార్హం.

ఆర్టీసీ డిపోలో 116 బస్సులు

వనపర్తి ఆర్టీసీ డిపోలో 116 బస్సులు ఉండగా అందులో 44 అద్దె బస్సులు ఉన్నాయి. అద్దె బస్సుల ప్రైవేటు డ్రైవర్లు మినహా 168 మంది డ్రైవర్లు 190 మంది కండక్టర్లు పని చేస్తున్నారు.


ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ఫైర్ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్న డీఎం (ఫైల్)

సీట్లకు తగ్గట్టుగానే ప్రయాణం చేస్తున్నారు..



బస్సుల్లో సీట్లకు తగ్గట్టుగానే ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఎవరికి డబుల్ డ్యూటీలు వేయడం లేదు. 8 గంటలే పని చేస్తున్నారు. ఒకవేళ డబుల్ డ్యూటీ చేసి ఉంటే మరుసటి రోజు సెలవు తీసుకుంటున్నారు. ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్నాం.

- దేవేందర్ గౌడ్, ఆర్టీసీ డీఎం

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

» ఫిర్యాదు చేసి 70 రోజులైనా పట్టించుకోని పోలీసులు
» విలేకర్ల సమావేశంలో స్మార్ట్ ఇండియా చైర్మన్, ఎండీ కరుణాకర్‌రెడ్డి

గద్వాల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో తాగునీరు అందించే సంస్థ స్మాట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులపై కొందరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో మానక హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు స్మార్ట్ ఇండియా చైర్మన్, ఎండీ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లతో స్మార్ట్ ఇండియా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొందని గత 70 రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

అయితే పోలీసులు ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించామన్నారు. అయితే ఇందుకు సంబంధించి ఎస్పీకి నోటీసులు కూడా వచ్చాయన్నారు. ఈ నెల 21లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని ఎస్పీని మానవ హక్కుల కమిషన్ ఆదేశించడం జరిగిందన్నారు.

అంతేకాకుండా కోర్టును కూడా ఆశ్రయించగా గద్వాల సివిల్ కోర్టు 2025, సెప్టెంబరు 4న తాత్కాలిక నిషేధాజ్ఞ కూడా ఇచ్చిందన్నారు. అయితే పోలీసులు కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోగా పిర్యాదుదారుడిపైనే తప్పుడు కౌంటర్ కేసును నమోదు చేయడం విడ్డూరమన్నారు. మేము గత 15 సంవత్సరాలుగా గ్రామాలకు తాగునీరు అందిండటంతో పాటు ఉపాధి, సాంకేతికత అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అలాంటి మా సంస్థకు చెందిన ఆస్తులను కొందరు నకిలీ డాక్యుమెంట్లతో కాజేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని ఆయన కోరారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

నల్లమలలో పర్యాటకుల రద్దీ


మన్ననూరు టోల్ చెక్‌పోస్టు వద్ద బారులు తీరిన వాహనాలు

మన్ననూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం కావడం, శని, ఆది వారాలు వరుసగా ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో శ్రీశైలం వెళ్లే పర్యాటకుల రద్దీ పెరిగింది. నల్లమల ఘాట్‌రోడ్డులోని మన్ననూరు, బ్రహ్మగిరి చెక్‌పోస్టుల వద్ద శ్రీశైలం వెళ్లి వచ్చే పర్యాటకుల వాహనాలు బారులు తీరి ఉండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

పర్యాటకులు మార్గంమధ్యలో గల పర్హాబాద్ టైగర్ సఫారీలో పర్యటించి అటవీ అందాలను ఆస్వాదించారు. పర్యాటకుల రద్దీతో మన్ననూరు, బ్రహ్మగిరి, వటవర్లపల్లి గ్రామాల్లోని కాటేజీలన్నీ రద్దీగా మారాయి, ఆదివారం రాత్రి 9గంటల సమయానికి 4వేల వాహనాలు శ్రీశైలం వెళ్లినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు.

ఉబికి వస్తున్న నీరు..

మిడ్జిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిడ్జిల్ మండల కేంద్రంలోని ఆదివారం సంత బజార్‌లో బోరులోంచి నీరు ఉబికి వస్తుండటం గమనించిన స్థానికులు నీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు భూ గర్భజలాలు పెరిగి నీరు వస్తుందని పలువురు పేర్కొన్నారు. మరికొందరేమో నా చిన్ననాటి నుంచి ఇప్పటి వరకు బోరులోంచి మోటార్ ఆన్ చేయకుండా నీరు రావడం నేను చూడలేదని చర్చించుకుంటున్నారు. ఉబికి వస్తున్న నీరు రోడ్డుపైకి వెళ్లకుండా డ్రైనేజీలోకి మళ్లించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


మిడ్జిల్‌లోని సంతబజార్‌లో బోరులోంచి వస్తున్న నీరు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మండలంలోని జీడిగుట్టతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పంచాంగులగడ్డతండాలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఇల్లు లేని కుటుంబాలకు తలదాచుకునేందుకు సొంత గృహం కల్పించడం మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతీ గ్రామం ప్రతీ తండా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల మద్దతుతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రూ. 50వేలు చోరీ

» బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్ తీసుకుంటుండగా ఘటన

గద్వాల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు వెళ్లేందుకు హడావుడిగా వచ్చిన ఓ వ్యక్తి గద్వాల రైల్వేస్టేషన్‌లో టికెట్ తీసుకుంటుండగా అతని జేబులో నుంచి రూ. 50వేలు చోరీ జరిగిన సంఘటన ఆదివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితుడు, రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన రఘు అనే వ్యక్తి ఆదివారం ఉదయం 6.30 గంటల ట్రైన్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు గద్వాల రైల్వేస్టేషన్‌లోని కౌంటర్‌లో టికెట్ కొరకు నిలబడ్డాడు. అయితే రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఒక్కసారిగా టికెట్ కోసం ఎగబడుతుండటంతో ఆ క్రమంలోనే తన జేబులో ఉన్న రూ. 50వేలు చోరీకి గురయ్యాయి. టికెట్ తీసుకునే సమయంలో తన జేబులో ఉన్న డబ్బులు పోయిన విషయం గమనించిన రఘు వెంటనే అక్కడ ఉన్న రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే దొంగ ఆచూకీ కనపడక పోవడంతో వెంటనే మహబూబ్‌నగర్ రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రఘు తెలిపారు.

ఉదండాపూర్‌లో వింతచేప

జడ్చర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఆదివారం మత్స్యకారుడికి వింతచేప లభ్యమైంది. రిజర్వాయర్‌లో మత్స్యకారులు రోజుమాదిరి ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లారు. వలలో వింత చేప లభ్యమవటంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దానిని బయట చూపించటంతో ప్రజలు సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు.


ఉదండాపూర్ రిజర్వాయర్‌లో లభించిన వింతచేప

ఇసుక టిప్పర్ పట్టివేత

రాజాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై ఆదివారం ఉదయం దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పరును పట్టుకున్నట్లు ఎస్ఐ శివానందం గౌడ్ పేర్కొన్నారు. బ్లూ కోర్టు డ్యూటీలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు క్రిష్ణయ్య, శ్రీనివాసులు పట్టుకుని టిప్పరును పోలీసుస్టేషన్‌కు తరలించిన్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పరు డ్రైవరుపై, యజయానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చంద్రఘడ్ కోటపై చిన్నచూపేలా?

» పర్యాటక కేంద్రంగా మారేనా?
» నెరవేరని మంత్రుల హామీ
» 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కోట


అమరచింత, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో అత్యంత పురాతన కట్టడాల్లో చంద్రఘడ్ కోట ఒకటి. ఆనాటి నుంచి పాలకులు మారుతున్నా పర్యాటక అభివృద్ధికి ఈ కోట నోచుకోవడం లేదు. రాష్ట్రంలోనే ప్రాచీన కట్టడాలలో అరుదుగా కనిపించే రాతి కట్టడం ఆనాటి రాజవంశస్తులను గుర్తు చేస్తుంది. జూరాల ప్రాజెక్టుకు కేవలం మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ కోటను అక్కడికి వచ్చే పర్యాటకులు విధిగా చంద్రఘడ్ కోటకు వస్తూ ఉంటారు.

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పర్యాటక మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి ఈ కోటను సందర్శించి పర్యాటక అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైందని చెప్పవచ్చు. దినదినం కోట శిధిలావస్థకు చేరుతున్నా పర్యాటక అభివృద్ధి మాత్రం అడుగు ముందుకు పోవడం లేదని చెప్పవచ్చు.

ప్రస్తుతం నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న వాకిటి శ్రీహరి పర్యాటక అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడంతో ప్రజల్లో ఆశలు చిగురించిన ఇంకా అమలు కావడం లేదన్న నిరాశ నెలకొన్నది.

● 18వ శతాబ్దం నాటి కోట నేపథ్యం

అమరచింత మండలం చంద్రఘడ్ గ్రామంలో ఉన్న ఈ కోటను 18వ శతాబ్ధంలో ఆనాటి మరాటి రాజులు బాజీరావు పీష్వా ఆత్మకూరు సంస్థానానికి సందర్శించి పన్ను వసూలు కోసం చంద్రసేనుడుని ఈ ప్రాంతానికి నియమించాడు. దీంతో చంద్రసేనుడు ధర్మాపూర్ గ్రామ శివారులో ఉత్తర దశ ఎత్తైన కొం డను ఎంచుకుని అక్కడ రా తి కోట నిర్మించుకున్నాడు. ఈ కోట నుంచి ఈ ప్రాం తంలో ఉన్న పలు సంస్థానాధీశుల నుంచి పన్నులు వ సూలు చేసి చంద్రసేనుడు మరాఠరాజులైన బాజీరావు పీష్వాకు పంపించేవాడు. చంద్రసేనుడు నిర్మించిన కోట కాలక్రమేణ చంద్రఘడ్ కోటగా పిలవబడుతూ వస్తుంది. కోట కింద భాగం గ్రామం ఏర్పడి ఆ గ్రామం సైతం చంద్రఘడ్ పేరుమీదుగా చంద్రఘడ్ గ్రామం ఏర్పడింది. ఈ కోటాలో చంద్రసేనుడు ఈ ప్రాంతానికి పన్ను వసూలు కోసం వచ్చి నిర్మించుకున్న చంద్రఘడ్ కోటపైన ప్రాచీన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సైతం నిర్మించాడు. ఆలయంతో పాటు కోట మధ్యలో తాగునీటి ఇబ్బంది కలగకుండా 8 చిన్న చిన్న కొలనులు ఏర్పాటు చేశాడు. ఆ కాలంలో ఎత్తైన కొండపై కోట నిర్మించి కొలనులో ఏడాది పాటు నీరు ఉండడం ఓ విశేషం. ఆనాటి నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతీ ఏటా శివరాత్రి సమయంలో ఉత్సవాలు. జాతర జరపడం ఆనవాయితీగా వస్తుంది.


చంద్రగడ్ కోట ముఖద్వారం


కోటపైన రక్షణ గోడ

● నెరవేరని మంత్రి హామీ

చంద్రఘడ్ కోటను పర్యాటక కేంద్రంగా మార్చడానికి 25 లక్షలు మంజూరు చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు కోటను సందర్శించినప్పుడు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.

హామీ ప్రతిపాదనల వరకు ఆగింది. ఎన్నికల సమయంలో జూరాల ప్రాజెక్టు, సంగంబండ, ముఖ్యంగా చంద్రఘడ్ కోటను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని మంత్రి శ్రీహరి హామీ ఇస్తూ వచ్చారు. దీంతో ఈ ప్రాంత పర్యాటకులు మండల ప్రజల్లో ఆశలు చిగురించినప్పటికీ రెండేళ్లు గడిచినా అమలు కాలేదు. ప్రజల్లో నిరాశే నెలకొన్నది.

హామీలు అమలు చేయాలి



ఎన్నికలకు ముందు చంద్రఘడ్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్న మంత్రి వాకిటి శ్రీహరి కోటను సందర్శించి తక్షణమే కోట అభివృద్ధి కోసం 25 లక్షలు నిధులు మంజూరు చేస్తానన్న చెప్పిన మంత్రి జూపల్లి తమ హామీ నిలబెట్టుకోవాలి. జూరాల ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులు చంద్రఘడ్ కోటకు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధిగా మార్చాలి.

● పసుల సురేందర్, చంద్రఘడ్ గ్రామం

కోటను పర్యాటక కేంద్రంగా మార్చాలి



ప్రభుత్వాలు మారుతున్నా చంద్రఘడ్ కోటను మాత్రం నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్నది. ఈ కోట ప్రాచీన కట్టడం, జూరాల ప్రాజెక్టుకు అతి సమీపంలో ఉన్న కోటపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక అభివృద్ధి చేయాలి. సందర్శకుల తాకిడి దినదినం పెరుగుతున్నది. ప్రాచీన కట్టడాన్ని కాపాడటంతో పాటు పర్యాటకుల విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలి.

● నాగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రఘడ్

న్యూస్ బాక్స్

మార్కెట్లో వసతులు కల్పిస్తాం

» మార్కెట్ కార్యదర్శి రమేష్‌కుమార్



నవాబ్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చే రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

మార్కెట్ ఆదాయం ఎలా ఉంది?

బాగుంది.. కానీ ఇంకా ఆదాయం పెంచాల్సిన అవసరం ఉంది. మార్కెట్‌కు ఓ గుర్తింపు తీసుకరావలన్నదే మా కోరిక.

సకాలంలో టెండర్లు వేయడం లేదనే విమర్శలు ఉన్నాయి?

అలాంటిది ఏమీ లేదు. కానీ నవాబ్‌పేట మార్కెట్‌కు బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, కొందుర్గు, చౌడాపూర్, మహబూబ్‌నగర్ మండలాల నుంచి రైతులు ధాన్యం తీసుకొస్తారు. ఈ క్రమంలో కొంత జాప్యం ఏర్పడుతుంది. వ్యాపారుల కోరక మేరకు సకాలంలో టెండర్లు వేసి రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం.

ఆదాయం ఉన్నా.. రైతులకు వసతులు లేవు?

ఇది నిజమే చాలా కాలంగా ఈ డిమాండ్ ఉంది. త్వరలో మార్కెట్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు చేయించేందుకు కృషి చేస్తా.

వ్యాపారులు తక్ పట్టీలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

రైతులు ధాన్యం విక్రయించినప్పుడు సదరు వ్యాపారి నుంచి తప్పనిసరిగా తక్ పట్టీలు తీసుకోవాలి. ఇది రైతు పొందితే ప్రమాదం సంభవించినప్పుడు బీమా సౌకర్యం ఉంటుంది. ఈ విషయంపై త్వరలో రైతులకు అవగాహన కల్పిస్తాం.

న్యూస్ బాక్స్

నేడు శివాలయంలో కార్తీక దీపోత్సవం

దేవరకద్ర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం కార్యక్రమం ఉంటుంది, మహిళలు పాల్గొనాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

దేవరకద్ర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్య క్షేత్రాలైన పంచరామాలకి ప్రత్యేక డీలెక్స్ బస్సులు ఈనెల 15న సాయంత్రం 7 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరుతాయని డిపో మేనేజర్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచరాములు దర్శనం అనంతరం ఈనెల 16న రాత్రికి బయలుదేరి 17న తెల్లవారుజామున మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందన్నారు. టికెట్టు చార్జీలు పెద్దలకు రూ.2,400, పిల్లలకు రూ.1,500 నిర్ణయించినట్లు తెలిపారు.

మొక్కజొన్న క్వింటాలుకు గరిష్టంగా రూ.2,116

నవాబ్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ యార్డుకు ఆదివారం వివిధ గ్రామాల నుంచి మొక్కజొన్న భారీగా తరలివచ్చింది. 10,351 బస్తాలు (5176 క్వింటాళ్లు)రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,116, కనిష్ఠంగా రూ.1,503 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు. రైతులు సరసమైన ధరలకు విక్రయించుకోవాలని, ఏమైన ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. హంస 278 బస్తాలు (111 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,811, కనిష్ఠంగా రూ.1,812 పలకగా, ఆర్ఎన్ఆర్ క్వింటాలుకు రూ.2,323 పలికినట్లు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు ముస్లిం యువకుడి అన్నదానం

భూత్పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని మునిరంగ స్వామి ఆలయం వద్ద అయ్యప్పదీక్ష స్వాములకు దాతల సహాయంతో ప్రతీ రోజు అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం మునిసిపాలిటీలోని అమిస్తాపూర్‌కు బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ ఫారుక్ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప గురుస్వాములు ఫారుక్‌ను అభినందించారు. ఫారుక్ మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు నిత్యం అన్నదానం చేస్తున్నట్లుగా గురుస్వాములు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు చెన్నకేశరెడ్డి, బాబు, బీజేపీ నాయకులు కెంద్యాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన క్రీడా ప్రాంగణాలు

» నిర్వహణ లేక ప్రజాధనం వృథా » పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు





మహమ్మదాబాద్ మండలం సంగాయపల్లి, షేక్‌పల్లి గ్రామాల్లో ముళ్ల చెట్లతో క్రీడా ప్రాంగణాలు

గండీడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రాంతాల్లోని యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. 2022 జూన్ 2న అట్టహాసంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేశారు. గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని 49 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసినా ప్రస్తుతం చెట్లతో దర్శనమిస్తున్నాయి. గతంలో క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో క్రీడా కిట్లు, ఆట వస్తువులను యువతకు పంపిణీ చేయడానికి ఆదేశాలు అందినా సరైన క్రీడా ప్రాంగణాలు లేకపోవడంతో పంచాయతీ భవనాలకే పరిమితమయ్యాయి.

బోర్డులకే పరిమితం

క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడేందుకు దాదాపు ఐదెకరాలకు పైగా ఆట స్థలం ఉండాలి. కానీ అధికారులు అవేవీ పట్టించుకోకుండా కొన్ని ప్రభుత్వ పాఠశాల్లో, గుట్టల్లో, స్థలాలు లేకపోయినా తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆటలు ఆడేందుకు యువత ఆసక్తి కనబర్చలేక కేవలం బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు

ప్రతీ గ్రామంలో గ్రామ పంచాయతీకి ఉపాధి హామీలో భాగంగా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీలకు సర్పంచుల పాలన లేనందున వీటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాల్లో పశువులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, చాలా చోట్ల క్రీడా మైదానాల్లో ఆటలు ఆడేందుకు వీలు లేకుండా కంపచెట్లు దర్శనమిస్తున్నాయి.

ఆసక్తి ఉన్నా.. ఆడలేని పరిస్థితి



ఆటలపై ఆసక్తి ఉన్నా.. ఆడేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి.

\- అంజనేయులు, పెద్దవార్వాల్

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో సాయంత్రం వేళ కబడ్డీ, వాలీబాల్ ఆడేందుకు యువకులు ఉత్సాహం చూపిస్తున్నా క్రీడా ప్రాంగణాల్లో వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించి, త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి.

\- మున్నూరు నవీన్, నంచర్ల

కనీస సౌకర్యాలు కల్పిస్తాం..



క్రీడా ప్రాంగణాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పజెప్పి, ఆటలు ఆడేందుకు వసతులు కల్పించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

\- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో

స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్‌గా గుర్తించాలి

» పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



మాట్లాడుతున్న పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల మాదిరిగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను జోనల్ పోస్టుగా గుర్తించాలని అప్పుడే గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 317 సమస్య పూర్తిగా పరిష్కారం అవుతోందని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే 317లో నష్ట పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం చాలా మందికి న్యాయం జరిగిందన్నారు. మరికొంత మంది ఉన్నారని వారిని కూడా సొంత జిల్లాలకు పంపించాలన్నారు. స్పౌజ్‌కు సంబంధించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా మిగిలిపోయారని వారికి న్యాయం జరగాలంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్ పోస్టు చేయాలని, వచ్చే బదిలీల్లో అమలయ్యే విధంగా జీవో తీసుకరావాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు పొంది 25ఏళ్ల గడిచిన వారు కూడా టెట్ రాయాలని, పాస్ కావాలని భయభ్రాంతులకు గురి చేయడం సరి కాదన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే పార్లమెంట్‌లో సవరణ చేయాలని దీనికోసం పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నిరంతరం పోరాడుతున్నాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి భూపతిసింగ్, నాయకులు నాగిరెడ్డి, రాంచందర్ నాయక్, ఆనంద్‌రెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

» రిషి వెంకటయ్య సేవలు మరువలేనివి » ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్‌లో నిర్వహించిన రిషి వెంకటయ్య స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా 30 సంవత్సరాలు సేవలు అందించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని, విద్యాభివృద్ధికి ఆయన సేవలు మరువ లేనివన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు తన వంతుగా కాలేజీని ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు తక్కువ ఫీజులతో విద్యనందించారని గుర్తు చేశారు. ఇక ముందు మరిన్ని విజయాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా రిషి విద్యాసంస్థల అధినేత చంద్రకళ వెంకటయ్య దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో కౌసర్ జాహన్ పాల్గొన్నారు.

'చెత్త' శుద్ధి ఏదీ?



పూజారితండాలో రోడ్డు పక్కనే ఉన్న డంపింగ్ యార్డు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇది ఊరికి ఎక్కడో దూరంగా ఉన్న డంపింగ్ యార్డు అనుకుంటే పొరపాటే. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 15వ వార్డు పూజారితండా ఇళ్లకు ఆనుకొని, రోడ్డు పక్కనే ఏర్పడిన డంపింగ్ యార్డు. ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, పరిశుభ్రతపై ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా.. ఎన్ని నిధులు మంజూరు చేసినా ప్రజల్లో అవగాహన, బాధ్యత రానంతవరకు అన్ని వ్యర్థమే. అందుకు మునిసిపల్ సిబ్బంది అలసత్వం ఓ కారణం. వారానికి ఒకటి రెండు సార్లు మాత్రమే చెత్త సేకరణకు రావడం వెరసి పూజారితండా ముఖ ద్వారం దుర్గంధమయంగా మారింది. మునిసిపల్ అధికారులు స్పందించి పారిశుధ్యంపై అవగాహన కల్పించడంతో పాటు చెత్తను సేకరించాలని తండావాసులు కోరుతున్నారు.

వివాదాస్పదంగా మసీదు నిర్మాణం

గండీడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచలింగాల తండా పరిధిలోని బండమీది తండా వద్ద ప్రభుత్వ స్థలంలో ఆదివారం మసీదు నిర్మాణానికి ముస్లింలు ప్రయత్నించగా బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులతో పాటు గ్రామస్థులు పనులు అడ్డుకున్నారు. కానీ ఈ స్థలం మాదేనని మాకు గ్రామ పంచాయతీ నుంచి నిర్మాణానికి అనుమతులున్నాయని ముస్లింలు తెలుపగా, విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. నిర్మాణానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాకనే నిర్మించాలని, ప్రభుత్వ స్థలమా? లేక ప్రవేట్ స్థలమా? అని తేలేదాక ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సీఐ గాంధీనాయక్ తెలిపారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గిరిజనులకు భూములు ఇచ్చే వరకు పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు దీప్లానాయక్

బాలానగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల భూములను గిరిజనులకు ఇచ్చే వరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా నాయకుడు దీప్లా నాయక్ పేర్కొన్నారు. మండలంలోని పలువు మీదితండా గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం 87లో కలిగిన గిరిజన రైతుల పట్టా భూములను ఎస్ఆర్బీ మినరల్ పరిశ్రమ యాజమాన్యం ఐదెకరాల భూములను కబ్జా చేసి ప్రహరీ నిర్మించింది. దీన్ని నిరసిస్తూ పరిశ్రమ ఎదుట భూములు కోల్పోయిన గిరిజనులు ఆదివారం ధర్నా నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన భూములను పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించుకున్నారని, ఆక్రమదారుల నుంచి భూములు విడిపించాలన్నారు. గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూములు గిరిజనులకు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ రైతులు కుమార్‌నాయక్, శ్రీనునాయక్, హరియా నాయక్, రాజునాయక్, పాల్గొన్నారు.

ఘర్షణకు దారితీసిన నవజీవన రీక్రియేషన్ క్లబ్ స్థల వివాదం

మహమ్మదాబాద్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నవజీవన రీక్రియేషన్ క్లబ్ వివాదాస్పద స్థలం దగ్గర ఆదివారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో నిర్మాణం చేపడుతున్న వారికి, నిరసన తెలుపుతున్న వారికి మాటామాట పెరిగి పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఘర్షణ కాస్త పెద్దది కావడంతో సీఐ గాంధీనాయక్ ఘటనా స్థలానికి చేరుకొని నిరసనకారులు, నిర్మాణం చేపట్టిన వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి, మాట్లాడారు. ఇరు వర్గాలు అల్లర్లు సృష్టిస్తే కేసులు చేస్తామని, ప్రస్తుతానికి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. ఈ విషయం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రెండు మూడు రోజుల్లో ఆ స్థలాన్ని మహిళా సమాఖ్యకు ఇచ్చే విధంగా పోరాడతామని నిరసనకారులు రామ్‌లాల్, రాజేశ్వర్, డిడ్డికాడి గోపాల్, పంతులు చెన్నయ్య, కొత్త నర్సింహులు, పవన్‌కుమార్, శాంతిరంగ్యా తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఆశిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గండీడ్/మహమ్మదాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'మొదలైన కోతలు' ప్రైవేట్‌ను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు అనే కథనం ఆదివారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా గండీడ్, ఆశిరెడ్డిపల్లి, బల్సుర్‌గొండ, పగిడ్యాల, రుసుంపల్లి, కొండాపూర్, సల్కర్‌పేట, మహమ్మదాబాద్, కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, సంగాయిపల్లి, ధర్మాపూర్, దేశాయిపల్లి, జూలపల్లి, మంగంపేట, మంగంపేట్ తండా, షేక్‌పల్లి, ముకర్లాబాద్, అన్నారెడ్డిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్ మరియు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీని వాస్‌రెడ్డి, ఆశన్న, సత్యనారాయణరెడ్డి, ఏపీఎంలు రజిత, నిర్మల, సీఈవో ఆశన్న పాల్గొన్నారు.

రెయిన్‌బో పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బెక్కం జనార్దన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం ఘనంగా రంగోత్సం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 4, 5, 6 తరగతులకు బాల్య విజ్ఞానంపై భారత సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 1,650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శశిధర్, ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం అన్నారు. ఇందులో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు ఈనెల 14న డీఈవో చేతుల మీదుగా అదించనున్నట్లు హెచ్ఎం మమత తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చౌకధర దుకాణాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. నగరంలోని బండ్లగేరి, వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంతాల్లో మహబూబ్‌నగర్ పట్టణ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజీవ్‌రెడ్డితో కలిసి చౌకధర దుకాణాలు షాప్ నంబరు 12, 19, 21, 34, 42 తనిఖీ చేశారు. షాప్ నెం.34లో డీలర్ కాకుండా వేరే వ్యక్తితో షాప్ నిర్వహించడం గమనించి, షోకాజ్ నోటీసు ఇవ్వాలని అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అన్ని చౌకధర దుకాణాలు సమయానుకూలంగా ఉదయం, సాయంత్రం తెరిచి ఉంచాలన్నారు.

ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఏబీవీపీ శ్రేణులు

జడ్చర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల శ్రీ చైతన్య పాఠశాలలో ఏబీవీపీ విద్యార్థి సంఘం శ్రేణులు దాడి చేటయంతో రూ.80 వేల విలువైన ఫర్నిచర్ ధ్వంసమైందని ప్రిన్సిపాల్ జడ్చర్ల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని తెలుగులో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు, తల్లిదండ్రుల అనుమతితో అదనంగా గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులమని చెప్పి విధ్వంసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కోయిల్‌సాగర్‌కు జలకళ

దేవరకద్ర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో 32 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంతో ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కింద రైతులు వరి పంట లను సాగు చేసుకుంటున్నారు.

సగర సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రణీల్ చందర్



సగర సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా పాలకొండ సాయి ప్రణీల్ చందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగర పాలక సంస్థ పరిధిలోని ఏనుగొండ సగర భవనంలో రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం జడ్చర్లకు చెందని పాలకొండ సాయి ప్రణీల్ చందర్‌ను అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా దేవరకద్రకు చెందిన గుంటి సత్యం, కోశాధికారిగా మూసాపేటకు చెందిన మదిగట్ల నారాయణ సగరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో పోటీ చేసి సగరుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన ప్రణీల్ చందర్ మాట్లాడుతూ జిల్లాలోని 8 మండలాల పరిధిలో 54 గ్రామాల్లో ఉన్న సగరలను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అంజనేయులు, రామ్‌సగర్, కేపీ రాములు, బంగారు నరసింహ్మా, చందు, గోవర్ధన్, దేవన్న, రవీందర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ

\- మహిళ మృతి

మిడ్జిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి పత్తి లోడ్‌తో వస్తున్న రెండు ట్రాక్టర్లు ఆటోను ఢీకొట్టడంతో మల్లాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి (22) వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన వడ్డె రాములు పెద్ద కుమార్తె మమతను మల్లాపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్యకు ఇచ్చి వివాహం చేశారు. కాగా కొత్తపల్లిలో సోమవారం నిర్వహించే సత్యనారాయణస్వామి వ్రతానికి మల్లేశ్వరితో 3 నెలల బాబు, కూతురు, కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో కొత్తపల్లి నుంచి మల్లాపూర్‌కు వెళ్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన రెండు పత్తి ట్రాక్టర్లు వెనువెంట బోయిన్‌పల్లి వైపు వెళ్తు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మల్లేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ చేతి విరిగిపోగా, మణికంఠ అనే వ్యక్తికి కాలు విరిగింది. మూడు నెలల బాబు, పాప పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కాగా మల్లేశ్వరిని కూడా మల్లాపూర్‌కు చెందిన రాంబాబుతో వివాహం కాగా ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..

జడ్చర్ల : బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జడ్చర్ల పట్టణంలో చోటు చేసుకుంది. మండలంలోని నసురుల్లాబాద్ గ్రామానికి చెందిన పోసెమోని వెంకటేష్ బైక్‌పై భార్యతో కలిసి ఆదివారం ఉదయం జడ్చర్లకు బయలుదేరాడు. జడ్చర్ల సమీపంలోని నిమ్మబావిగడ్డకు చేరుకోగా వెంకటేష్ భార్య వనజ బైక్‌పై నుంచి జారి పడి మృతి చెందింది. తన అక్క చావుకు కారణమైన బావపై చర్యలు తీసుకోవాలని వనజ తమ్ముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.